‘పర్తి’.. పర్యాటక కాంతి



చిత్రావతి నదిలో బోటింగ్



నక్షత్రశాల నుంచి బయటకు వస్తున్న పర్యాటకులు

- జిల్లా కేంద్రం పుట్టపర్తికి జనతాకిడి
- చిత్రావతిలో బోటింగ్‌తో జాయ్
- నందడిగా హోటళ్లు, పార్కులు

పుట్టపర్తి టౌన్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి పర్యాటక శోభ సంతరించుకొంటోంది. పర్తి యాత్రల పేరుతో 153 దేశాల నుంచి భక్తులు తమ దేశాలలో, రాష్ట్రాలలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి సత్యసాయి బాబా మహా సమాధి దర్శనార్థం వేల సంఖ్యలో పుట్టపర్తికి చేరుకోవటంతో పర్యాటక ప్రదేశాల్లో సందడి పెరిగింది.

హోటళ్లు, పార్కులు కళకళ..

పుట్టపర్తి పట్టణంలో ప్రశాంతి నిలయంలో పాటు సత్యసాయి బాబా సమాధి, చైతన్యజ్యోతి మ్యూజియం, నక్షత్రశాల, మహా కల్పవృక్షం తో పాటు చిత్రావతి పరివాహపు ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోటింగ్, హోటళ్లు, పార్కులు పర్యాటకులను ఎక్కువగా ఆకర్శిస్తున్నాయి. ఈ ప్రదేశాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి భక్తులు ఎక్కువగా సందర్శిస్తున్నారు.

బస్సులు, రైళ్లకూ తాకిడి

జిల్లా ఏర్పడిన తరువాత ప్రయాణికులకు అనుగుణంగా రవాణా శాఖ కూడా అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. ఇప్పటికే ప్రధాన ప్రాంతాల నుంచి పుట్టపర్తితో పాటు ఇతర ప్రాంతాలకు కూడా బస్సులు సర్వీసులు పెంచింది. అలాగే ప్రశాంతి నిలయం మీదుగా పుట్టపర్తిలో ప్రస్తుతం రైళ్లు, బస్సులు కూడా ఎక్కువ మంది వినియోగించుకొంటున్నారు. ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ మీదుగా 12 రైళ్లు నడుస్తున్నాయి. కొన్ని డైలీ, కొన్ని బైవీక్లి, మరిన్ని వీక్లీ రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వీటితో పాటు ప్యాసింజర్ రైళ్లు కూడా నుడుస్తున్నాయి. పర్యాటకులు, భక్తులు పెరిగితే బస్సులు, రైళ్లు మరిన్ని అందుబాటులోకి రానున్నాయి.

చిత్రావతిలో బోటింగ్‌తో ఉల్లాసం..

పుట్టపర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంది. కొన్ని నెలల క్రితం కురిసిన వర్షాలకు చిత్రావతి నది చెక్ డ్యాం నిండుకుండను తలపిస్తోంది. దీంతో అక్కడ పర్యాటకలను ఆకర్శించేందుకు పర్యాటక శాఖ అనుమతులతో బోటింగ్, హోటల్, పార్కులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతున్నారు. చిత్రావతి నది పక్కన ఎత్తైన ప్రదేశంలో ప్రభుత్వం అనుమతులతో హోటల్, 8 మర పడవలు అందుబాటులో ఉంచారు. సత్యసాయి బాబా మహాసమాధి దర్శనంతో పాటు చిత్రావతి నదిలో విహారంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తచెరువు: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను సోమవారం తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రబోధ సేవా సమితి కొత్తచెరువు కమిటీ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు నాగేంద్ర, సభ్యులు అలివేలమ్మ, పద్మావతి, రెడ్డమ్మ, ప్రభావతి, సాయినాథ్, చంద్రశేఖర్, రెడ్డప్ప చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

గాండ్లపెంట: మండల కేంద్రానికి సమీపంలోని కదిరి–రాయచోటి ప్రధాన రహదారిలో 379–1 సర్వే నంబరులో ఇల్లులేని నిరుపేదలు 136 మందికి ఇంటి నివేశన స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో భాగంగా సోమవారం ఎంపీడీఓ ఆంజినప్ప, తహసీల్దార్ రవి సమక్షంలో హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. మార్కింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కటారుపల్లి, గాండ్లపెంట గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్జీలను నిర్లక్ష్యం చేయవద్దు

బత్తలపల్లి: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో ప్రజల నుంచి అందే అర్జీలను నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఇందులో 8 అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిలో ఇంటి స్థలాల కోసం రెండు, సర్వే కోసం రెండు, తమ భూమి జాతీయ రహదారితో నష్టపోతున్నామని పరిహారం ఇప్పించాలని రెండు, భూ సమస్యలపై రెండు అర్జీల చొప్పున అందినట్లు తెలిపారు. ఎంపీడీఓ సాయి మనోహర్, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజనీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, తదితరులున్నారు.

విరాళం అందజేత



నగదు అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఉన్న మజిద్ ఏ రసూల్ ప్రహరీ నిర్మాణానికి రూ.50 వేలు ఆర్థికసాయాన్ని సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ అందజేశారు. ఈ మొత్తాన్ని ఆయన తండ్రి బత్తల వెంకటరమణ మసీదు ముతవలి రఫీక్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బాహుఉద్దీన్, వైస్ ఎంపీపీ బత్తల ఆదినారాయణ,ఇండస్ట్రియల్ చైర్మన్‌నౌషాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

15 హెక్టార్లలో పంటనష్టం

గాండ్లపెంట: మండల పరిధిలోని సోమయాజులపల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 18న శనివారం రాత్రి వడగండ్ల వర్షానికి ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. సచివాలయ ఉద్యానవన సహాయకులు తరుణ్ క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి 15 హెక్టార్లలో బొప్పాయి, టమాట, బూడిద గుమ్మడి, బంతి పూలకు సంబంధించి నష్టాన్ని అంచనా వేసినట్లు తెలిపారు. వివరాలు ఉన్నతాధికారులకు పంపి పరిహారం త్వరితగతిన మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. .

నష్ట వివరాలు సేకరించండి

అమడగూరు: అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను గుర్తించాలని వ్యవసాయాధికారి జ్యోత్స్న పేర్కొన్నారు. సోమవారం ఆమె అమడగూరు, చినగానిపల్లి రైతుభరోసా కేంద్రాలను సందర్శించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఎన్ని ఎకరాల్లో ఏఏ పంటలు నష్టపోయారో ఫోటోతో పాటుగా రికార్డులు తయారు చేయాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న వారు నష్ట పరిహారానికి అర్హులన్నారు. ఇంతవరకూ పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయించుకోని వారు వెంటనే చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా సరస్వతీ పూజ

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటిక్రాస్‌లో ఉన్న సాయిబాబా విద్యానికేతన్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సలీంబాషా మాట్లాడుతూ ఇష్టపడి చదవడం ద్వారా పరీక్షలలో మంచి ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నసీబ్‌జాన్, ఉపాధ్యాయులు రవీంద్ర, గౌస్‌మోద్దీన్, దాదాబాషా, అక్రం తదితరులున్నారు.

రహదారికి మరమ్మతులు

ఎన్‌పీకుంట: చీమలచెరువుపల్లికి వెళ్లే రహదారి గుంతలమయమై రాకపోకలు సాగించడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడేవారు. రెడ్డివారిపల్లికి చెందిన ఉప్పుతోల్ల నాగేంద్ర స్థానిక సర్పంచ్ అంజినమ్మకు విషయం తెలియపరిచి సర్పంచ్ ఆధ్వర్యంలో రూ.15,000 తన సొంత నిధులతో రహదారికి మరమ్మతులు చేయించారు. ఉపసర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ బయారెడ్డి, శ్రీరాములు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో పది పరీక్ష పత్రాలు భద్రం

గాండ్లపెంట: ఈ ఏడాది ఏప్రిల్ నెల 3 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు సోమవారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. రూట్ అధికారి క్రిష్ణానాయక్ పరీక్షల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారుల సమక్షంలో పోలీసులకు అప్పగించారు. 10వ తరగతికి సంబంధించి 6 ప్రశ్నపత్రాల తొలి సెట్‌ను భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

కదిరి అర్బన్: మండల పరిధిలోని కదిరి కుంట్లపల్లిలో వెంకటరమణ (50) అనే వ్యక్తి సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేల నగదును మృతుని భార్య సుకన్యకు గ్రామ సర్పంచ్ రజనీష్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శి మమత, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ అందజేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

తలుపుల: మండల కేంద్రంలోని కస్తూరి బా గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతి, 7,8 తరగతులలో మిగిలిన సీట్లకు ఈ నెల 27 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని సోమవారం ఎస్‌ఓ మోహనమ్మ తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పొలంబడి పకడ్బందీగా నిర్వహించాలి



రైతుకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఎన్‌పీకుంట: పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయ, ఆర్బీకే సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రిసోర్స్ సెంటర్ సహాయ వ్యవసాయ సంచాలకులు సనావుల్లా సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎన్.పీ.కుంట, గాండ్లపెంట మండలం ఆర్బీకే సిబ్బందికి పొలంబడి, ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్బీకే సిబ్బంది ఎల్లపుడూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం మండల కేంద్రానికి సమీపంలో వేరుశనగ, వరి పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. వరి పంట ప్రస్తుతం పిలక దశ నుండి చిరుపొట్ట దశకు చేరిందని తెలిపారు. ఎకరా వరి పొలానికి 50 కేజీల యూరియా తో పాటు 20కేజీల ఎంఓపి వాడాలని సూచించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఆశించినట్లయితే లీటర్ నీటిలో రెండు గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందు కలిపి పిచికారి చేయించాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి, వ్యవసాయ సహాయకురాలు విద్యావతి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత్త జి.శశికళ, ఏఓ లక్ష్మీప్రియ, ఏఈఓ శిరీష, సింధు, విఏఏలు, విహెచ్ఏలు పాల్గొన్నారు.

వేలం పాటకు అనూహ్య స్పందన

- గుడ్‌విల్ కంటే రెట్టింపు ఆదాయం



హాజరైన ప్రజలు, వ్యాపారులు



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం: పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద నూతనంగా నిర్మించనున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ గదులకు సోమవారం నిర్వహించిన వేలం పాటకు అనూహ్య స్పందన లభించింది. మున్సిపల్ అధికారులు నిర్ణయించిన గుడ్‌విల్ కంటే రెండింతలు వేలంలో పాట పాడి వ్యాపారులు గదులను దక్కించుకున్నారు. స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్న స్థలంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్‌చైర్మన్‌లు యర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజులు హాజరయ్యారు. తొలుత కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుకాణాల గదులకు గుడ్‌విల్ అమౌంట్ రూ.10,02,115 మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. అయితే వ్యాపారులు పలు గదులను అధిక ధరలకు వేలం పాట పాడి దుకాణాలను దక్కించుకున్నారు. వేలం పాటలో గ్రౌండ్ ఫ్లోర్‌కు సంబంధించిన దుకాణాలను రూ.30 లక్షల నుంచి రూ.50లక్షల వరకు ఒక్కో గదిని పలువురు వ్యాపారులు దక్కించుకున్నారు. మొదటి అంతస్తుకు సంబంధించి గరిష్ఠంగా రూ.14 లక్షల గుడ్‌విల్ అమౌంట్ పాడి పలువురు వ్యాపారులు దుకాణాలను దక్కించుకున్నారు. మొత్తం మీద ఈ వేలం పాటలో షాపింగ్ కాంప్లెక్స్ 15 గదులకు రూ. 1,49,59,917 గుడ్‌విల్ అమౌంట్‌ను నిర్ణయిస్తే వ్యాపారులు వేలం పాట ద్వారా రూ. 3,51,8,500 పాడి దుకాణాలను దక్కించుకున్నారు. ధర్మవరం పట్టణ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో మున్సిపాలిటీకి ఆదాయం సమకూరడం ఇదే ప్రథమం. కాంప్లెక్స్‌లో ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, రజక, నాయిబ్రాహ్మణులకు రిజర్వేషన్ కల్పించారు. అయితే మొత్తం 15 గదులలో ఒక గది మినహా అన్ని గదులను వేలం పాటలో వ్యాపారులు దక్కించుకున్నారు. చైర్‌పర్సన్ లింగం నిర్మల మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఆధునిక సౌకర్యాలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేలా ఎమ్మెల్యే కేతిరెడ్డి కృషి చేశారన్నారు. 6 నెలల్లో కాంప్లెక్స్ నిర్మించి వ్యాపారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఓ ఆనంద్ పట్టణ సచివాలయ కన్వీనర్‌లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో యజమానులకు భూరక్ష

బత్తలపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా చేపడుతున్న రీ సర్వేతో యజమానులకు ఆస్తి హక్కుపై మరింత భద్రత ఉంటుందని ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గరిశలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంపై సర్పంచు పద్మావతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఆస్తి విక్రయించాలన్నా, కొనుగోలు చేయాలన్నా పలు సందేహాలతో రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. భూమి, రెవెన్యూ రికార్డులను అనుసంధానం చేయడానికి సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. సర్వే కోసం లబ్ధిదారులు అర్జీ ఇవ్వకపోయినా సర్వే నిర్వహణ, యాజమాన్యపు హక్కు, నిర్ధారణ రికార్డుల్లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓ నరసింహులు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రీ సర్వే చేసి ప్రభుత్వం ఆస్తులు, ప్రైవేట్, బహిరంగ స్థలాలను గుర్తించనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయిన తరువాత డిజిటలైజేషన్ పద్ధతిలో క్యూ ఆర్ కోడ్‌తో భూహక్కు పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి భారతి, సర్వేయర్ రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నారెడ్డి, నాగిరెడ్డి, ఈశ్వరయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే పక్కాగా చేపట్టాలి

కనగానపల్లి: భూ సర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ పీ.వీ.రమణ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రీ–సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. మండల సర్వేయర్ స్టీఫెన్, వీఆర్వో మారుతిప్రసాద్, పలువురు గ్రామ రెవెన్యూ సర్వేయర్లు పాల్గొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీన బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రతినిధులు అందరూ సమావేశానికి హాజరు కావాలని, అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

సత్యసాయి కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

తాడిమర్రి: స్థానిక మద్దులచెర్వు సంపువద్ద సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు సోమవారంతో నాల్గవ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ జిల్లా నాయకులు పార్నపల్లి నారాయణ పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారని యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు నెలల జీతాలు రావలసి ఉండగా రెండు నెలల జీతాలు మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, నడిపి ఓబిలేసు, మహేశ్వర్ రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ పాదయాత్రలో దొంగల హల్‌చల్

నల్లచెరువు: టీడీపీ నాయకుడు లోకేశ్ యువగళం పాదయాత్రలో జేబుదొంగలు హల్‌చల్ చేశారు. పాదయాత్ర చూసేందుకు వచ్చిన స్థానికులను దుండగులు దోచుకున్నారు. ఆదివారం యువగళం పాదయాత్ర నల్లచెరువు మండలానికి చేరుకున్నందున లోకేశ్‌ను చూడటానికి వచ్చిన తమ వద్దనున్న దాదాపు రూ.50 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్ దొంగిలించారని గోవిందు, ప్రసాద్, రిపోర్టర్ అంజనేయులు, ఎద్దుల అంజినప్ప సోమవారం తెలిపారు. పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గ్రామీణ రహదారులకు సొబగులు



నూతనంగా నిర్మించిన చిల్లగోర్లపల్లి తారురోడ్డు

నల్లమాడ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దెబ్బతిన్న గ్రామీణ రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి కొత్త సొబగులు తెస్తున్నారు. మండల కేంద్రం నల్లమాడకు కిలో మీటర్ దూరంలోని చిల్లగోర్లపల్లి తారురోడ్డు గుంతలు పడి, కంకర తేలి రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా తయారై ఉండేది. నెలరోజుల క్రితం విషయాన్ని గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తక్షణం స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) నిధులు రూ.27 లక్షలతో యంత్రాల సాయంతో తిరిగి కంకర పూడ్చి తారురోడ్డు నిర్మించారు. నూతనంగా తారురోడ్డు నిర్మించి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి చిల్లగోర్లపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటికీ ‘ఆసరా’



సభ్యురాలికి వివరాలు తెలియజేస్తున్న వైకేపీ సిబ్బంది (ఫైల్)

- ప్రారంభమైన వైఎస్సార్ ఆసరా సంబరాలు
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని తెలియజేస్తున్న వైకేపీ సిబ్బంది
- ప్రత్యేక సమావేశాలు నిర్వహించి జీవనోపాధులపై అవగాహన

పుట్టపర్తి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని కొనసాగిస్తూ మూడో విడత ఆసరా మొత్తాన్ని మహిళల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమం పండుగ వాతావరణంలో చేపట్టనున్నారు. ఇందు కోసం ముందుగానే 5 రోజుల పాటు గడప గడపకూ వెళ్లి ఆసరా లబ్ధిని తెలియజేయాలని వైకేపీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. మూడు రోజుల క్రితం నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆయా మండలాల వైకేపీ సిబ్బంది ఆసరా సభ్యురాలి ఇంటికి వెళ్లి బొట్టు పెట్టి లబ్ధిని తెలియజేస్తున్నారు. సంఘానికి వచ్చిన మొత్తం, సభ్యురాలికి వచ్చిన మొత్తాన్ని తెలియజేస్తూ డిజిటల్ రసీదును అందజేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఈనెల 25న లబ్దిదారుల ఖాతాల్లో మూడో విడత మొత్తాన్ని ఖాతాల్లో జమ చేయనుంది. పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరు, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఓడీసీ, పుట్టపర్తి మండలాల్లోని ఎస్‌హెచ్‌జీ గ్రూపులు 3,603 ఉండగా వాటికి రూ.27,40,56,715 నగదు జమ కానుంది.

ప్రత్యేక సమావేశాలు..

మొదటి, రెండవ విడతలో వచ్చిన మొత్తాల గురించి వివరిస్తూ ముందుకు సాగేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. జీవనోపాధుల ఏర్పాటుకు అదనంగా డబ్బు కావాలా అని అడిగి బ్యాంకు రుణం ఇప్పించనున్నారు. స్వయం సహాయ సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించనున్నారు.

మండలం	గ్రూపులు	ఖాతాల్లో జమ కానున్న మొత్తం
అమడగూరు	448	3,19,84,894
బుక్కపట్నం	661	4,83,93,074
కొత్తచెరువు	746	6,34,08,124
నల్లమాడ	569	4,09,16,312
ఓడీసీ	704	5,26,17,440
పుట్టపర్తి	475	3,67,36,871
మొత్తం	3,603	27,40,56,715

దివ్యాంగ విద్యార్థుల ఉన్నతికి సహకారం



మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్ నాయక్

ధర్మవరం అర్బన్: దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందించి వారి ఉన్నతికి సహకరిస్తున్నామని ఎంఈఓ సుధాకర్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోనున్న భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగ విద్యార్థుల ఉపకరణాలు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందించి వారు మానసికంగా, శారీరకంగా మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. హియరింగ్ ఎయిడ్స్ 18, వీల్ చైర్స్ 14, సీపీ చైర్ 4, రొలేటర్స్ 7, షూ 1 చొప్పున మొత్తం 44 ఉపకరణాలను ఎంపిక చేశామన్నారు. అనంతరం వైద్యులు దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు నివేదిత, పద్మజ, కిరణ్, భాస్కర్‌నాయక్, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.